క్లుప్తంగా

ఘనంగా హనుమత్ వ్రతం



హనుమంతుడికి పూజలు చేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో కొలువైన ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం హనుమత్ వ్రత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7.30 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం సుందరకాండ పారాయణం చేశారు. సింధూర పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం కూడా విశేష పూజలు నిర్వహించనున్నారు. 13న హనుమత్ వ్రతం పురస్కరించుకుని పెద్ద ఎత్తున పూజలు నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 6 నుంచి స్వామికి పంచామృతాభిషేకాలు, లక్ష తమలపాకుల పూజ, 9 గంటల నుంచి సుందరకాండ పారాయణం, విశేష హవనం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

విద్యార్థులకు దుప్పట్ల వితరణ



వేద విద్యార్థులకు దుప్పట్లు అందిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పాఠశాల విద్యార్థులకు, నాదస్వరం, డోలు వాయిద్య విద్యార్థులకు, సంస్కృతోన్నత పాఠశాల హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నగరానికి చెందిన కామాక్షి సేవా సంఘం, నారాయణ సేవా దళం ప్రతినిధులు వితరణగా అందించిన ఈ దుప్పట్లను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సంఘాల ప్రతినిధులను ఈవో అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-2 పరిధి 33 కేవీ ఫీడర్ ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్(పీఎంఐ) పనుల కారణంగా పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఆ రోజు ఉదయం ఒక ప్రకటనలో తెలియజేసారు. దీంతో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

దాబాగార్డెన్స్/పెందుర్తి: జీవీఎంసీ జోన్-8 పరిధి కృష్ణాపురం హెడ్‌వర్క్స్‌లోని ఫిల్టర్ బెడ్స్ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం 93వ వార్డులో కొన్ని ప్రాంతాలు, 98 వార్డులోని చాలా ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ (ఈఈ) కనకారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో జోన్ పరిధిలోని సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పల నరసింహం కాలనీ, వెంకటసాయినగర్, బంట కాలనీ, రవినగర్, లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకుల్‌ధామ్ కాలనీ, రెల్లివీధి, కృష్ణ రాయపురం, గొల్లవిల్లివానిపాలెం, ఎల్‌ఐసీ కాలనీ, సుజాత నగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీహెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతినగర్, ఉడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురి లే అవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కుళాయిల ద్వారా నీటి సరఫరాకు ఇబ్బందులున్నా.. తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.

కాలుష్యంతో తాడి.. తల్లడిల్లి



కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామం

- ఫార్మా కాలుష్యం బారిన తాడి ప్రజలు
- ఎన్నికల వరకే గ్రామ తరలింపు హామీ
- ప్రభుత్వాలు మారినా.. మారని బతుకులు
- కూటమి నేతల హామీ అమలయ్యేనా?

తాడి, చినతాడి, తాడి కాలనీ.. పేర్లు వేరైనా అంతా ఒకటే గ్రామం. సుమారు మూడువేల మందికి ఆవాసం. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఇక్కడ ప్రధాన హామీ ఈ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తామనడమే..! ఒకటిన్నర దశాబ్దంగా ఈ హామీలు నీటిపై రాతలుగానే మారుతున్నాయి. ఫార్మా పరిశ్రమల కాలుష్యంతో అల్లాడుతున్న తమను సురక్షిత ప్రాంతానికి తరలిస్తే చాలని నాయకులను, అధికారులను ఇక్కడి ప్రజలు వేడుకోని రోజు లేదు. ఈసారి కూడా ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇదే హామీ గుప్పించారు. అధికారంలోకి వచ్చాక.. తమ గురించి కనీసం పట్టించుకోవట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 ఏళ్లుగా అవస్థలు

ఒకప్పుడు తాడి గ్రామం చుట్టూ చెరువుల నిండా సమృద్ధిగా నీటి వనరులు, పచ్చని పొలాలతో బంగారు పంటలు పండేవి. ప్రజలు ఎంతో ఆనందంగా జీవించేవారు. 15 ఏళ్ల క్రితం ఫార్మా పరిశ్రమలు కారణంగా ఇక్కడి కొన్ని గ్రామాలను సేకరించారు. ఈ పరిశ్రమలకు, గ్రామానికి మధ్య చిన్న రోడ్డే హద్దు. దీన్ని ఆనుకుని ఉన్న తాడి, చినతాడి, తాడి కాలనీలను పట్టించుకోలేదు. ఫార్మా పరిశ్రమల కాలుష్యంతో ఒక్కసారిగా వీరి పరిస్థితులు తలకిందులయ్యాయి. భూగర్భ జలాలు కలుషితమై, దప్పిక తీర్చుకునేందుకు కాసిన్ని మంచి నీళ్లు కూడా దొరకని దుస్థితి. గత్యంతరం లేని వాళ్లు అదే నీరు తాగి, మోకాళ్ల నొప్పులతో నడవలేని స్థితిలో మంచానపడుతున్నారు. సురక్షిత తాగునీటి కోసం లంకెలపాలెం, అగనంపూడి, పరవాడ తదితర ప్రాంతాల నుంచి మినరల్ వాటర్ క్యాన్లను రప్పించుకుంటున్నారు.

రాత్రుళ్లు నరకం

రాత్రి వేళ, వాతావరణం కాస్త చల్లగా ఉన్నప్పుడు, వర్షాలు కురిసేటపుడు ఇక్కడి వారి బాధలు వర్ణనాతీతం. ఆ సమయంలోనే ఎక్కువగా ఫార్మా వ్యర్థ వాయువులను గాల్లోకి వదులుతుండటంతో తలుపులు మూసుకుని, ఇళ్లల్లో ఉన్నా భరించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. కాలుష్య కారకాలను పీల్చడంతో ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. చర్మ వ్యాధులు, గుండె, శ్వాసకోశ, క్యాన్సర్, గొంతు, కళ్ల మంటలు వంటి రోగాలతో నానా అవస్థలు పడుతున్నట్లు చెప్తున్నారు. పరిశ్రమల్లో తరచూ చోటుచేసుకుంటున్న అగ్ని ప్రమాదాలు, విష వాయువుల లీకేజీలతో జనాలు భయంభయంగా కాలం గడుపుతున్నారు. కాస్తోకూస్తో ఆర్థిక స్థోమత కలిగిన వారు, గ్రామాన్ని వదిలి దూరప్రాంతాల్లో స్థిరపడుతున్నారు.

పరవాడ: కూటమి ప్రభుత్వాన్ని గెలిపించండి.. ఫార్మా కాలుష్య బాధిత తాడి గ్రామాన్ని తరలించి, పునరావాసంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీలు గుప్పించారు. 2014 ఎన్నికల్లో కూడా ఇదే హామీతో టీడీపీ అధికారంలోకి వచ్చింది. అధికారంలో నుంచి దిగిపోయే ముందు పెదముషిడివాడలో సుమారు 16 ఎకరాలు కేటాయించినట్లు జీవో విడుదల చేసి, ఊరుకుంది. నేటి వరకు తాడి గ్రామ తరలింపు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మళ్లీ అదే హామీతో కూటమి తరపున జనసేన ఎమ్మెల్యేగా పంచకర్ల రమేష్‌బాబు గెలిచారు. ఇప్పటి వరకు ఆ దిశగా కనీస ప్రయత్నం కూడా చేస్తున్న దాఖలాల్లేకపోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జేఎన్ ఫార్మాసిటీ ముఖచిత్రం

భయం భయంగా బతుకుతున్నాం



ఇళ్ల పక్కనే ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయం భయంగా కాలం గడుపుతున్నాం. తరచూ సంభవిస్తున్న రియాక్టర్ల పేలుళ్లు, అగ్ని ప్రమాదాలపుడు పిల్లా పాపలతో పరుగులు తీస్తున్నాం. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలతో రాత్రి సమయాల్లో నిద్రాహారాలు లేకుండా పోతున్నాయి.

– అట్టా దుర్గమ్మ, గృహిణి

విష వాయువులతో ఊపిరాడట్లేదు



ఫార్మా పరిశ్రమల విష వాయువులతో ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా ఉంది. వాతావరణం చల్లబడి, మంచు, వర్షం కురిసిన సమయాల్లో ఫార్మా పరిశ్రమల నుంచి యథేచ్ఛగా విష వాయువులను వదిలేస్తున్నారు. ఆ సమయంలో ఊపిరి సలపట్లేదు. కళ్ల మంటలు, గొంతు నొప్పితో సతమతమవుతున్నాం. చాలా మంది చర్మ, గుండె, శ్వాస కోశ వ్యాధులతో బాధపడుతున్నారు.

– మాధంశెట్టి దేముడమ్మ, తాడి కాలనీ

సురక్షిత ప్రాంతానికి తరలించండి



ఏళ్ల తరబడి విషవాయువులతో నరకయాతన అనుభవిస్తున్నాం. సురక్షిత ప్రాంతానికి గ్రామాన్ని తరలించి ఆదుకోవాలని చేసిన వినతులు నేతలకు పట్టడం లేదు. ఎన్నికల ముందు గ్రామాన్ని తరలిస్తామని ఇచ్చిన హామీలను ఎన్నికల అనంతరం నేతలు మరచిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నాం.

– గొల్లవిల్లి రమణ, చినతాడి

కిశోరి వికాసంతో బాలల పట్ల ప్రత్యేక శ్రద్ధ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో లలితకుమారి

పరవాడ: బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సబ్బవరం సీడీపీవో వి.లలిత కుమారి అన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తల కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. ఆహారం, ఆరోగ్యం, విద్య, రక్తహీనత, రుతు క్రమంలో పాటించాల్సిన శుభ్రత, జాగ్రత్తలు, పోక్సో యాక్ట్-2012, చట్టబద్ధమైన దత్తతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఎంఈవోలు ఎం.దివాకర్, సాయిశైలజ, పరవాడ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ హారిక, వెలుగు ఏపీఎం బి.రంగారావు, పీహెచ్ఎన్ కె.జానకి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్‌ల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్ఎఫ్) చెక్‌లు పంపిణీ చేశారు. బుధవారం సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పురుషోత్తపురానికి చెందిన గొంప కుమారికి రూ.1.5 లక్షలు, ఫణిహారం మారుతి(సుజాతనగర్)కి రూ.64 వేలు, 88వ వార్డు అజనిగిరికి చెందిన బొడ్డిపల్లి హేమవర్షిణికి రూ.2.55 లక్షలు, సబ్బవరం మండలం మొగలిపురానికి చెందిన కర్రి పెంటయ్యకు రూ.70 వేలు చికిత్స నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్‌లను అందించారు.

కూటమి పాలనలో రైతులకు అడుగడుగునా దగా

- తప్పుడు హామీలతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రైతుల్ని వంచించారు
- వైఎస్సార్‌సీపీ నియోజవర్గ ఇంచార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- 'అన్నదాతకు వైఎస్సార్‌సీపీ అండ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదీప్‌రాజ్, పార్టీ ముఖ్య నేతలు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం రైతులను దారుణంగా వంచించిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అనకాపల్లి కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిర్వహించ తలపెట్టిన ధర్నాకు నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు రాంపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో 'అన్నదాతకు వైఎస్సార్‌సీపీ అండ' ధర్నా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ రైతులకు అనేక హామీలు గుప్పించారని, కానీ ఆరు నెలలు గడుస్తున్నా రైతులకు చేసిన మంచి ఒకటి కూడా లేదని ఆక్షేపించారు. అన్నదాతను నిలువునా ముంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలిచారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీరును ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అండగా ఉండే కార్యక్రమాలలో పార్టీ తరుపున చురుగ్గా పాల్గొనే నాయకులు, కార్యకర్తలకు రానున్న రోజుల్లో తగిన గుర్తింపు దక్కుతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సీనియర్ నేతలు మధుపాడ అంజి, పి.ఎస్.రాజు, బోకం రామునాయుడు, కొటాన రాము, బంధం నాగేశ్వర రావు, చిరికి దేముడు, పాలిశెట్టి సురేష్, గొరవల్లి శ్రీను, కర్రి బాబు, కోన రామారావు, నదియా, దాడి ఉమా మహేష్, మెంటి మహేష్, రాపర్తి మాధవరావు, దాసరి సత్తిబాబు, మోపాడ అప్పారావు, సత్యనారాయణమూర్తి, బోని గంగునాయుడు, చందుయాదవ్, జోబ్‌దాస్, వెన్నెల సన్యాసిరావు, తామర్ల నరసింగ్, పైడిరెడ్డి, వర్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మత్స్యకార్మికుల ఆందోళన



సచివాలయం వద్ద నిరసనకు దిగిన మత్స్యకార్మికులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ పరిధి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలారిపేట, సమ్మెంగపాలెం గ్రామాల మత్స్యకార్మికులు బుధవారం స్థానిక సచివాలయం ఎదుట నిరసనకు దిగారు. తమ గ్రామాల్లో కొన్నాళ్ల నుంచి తాగునీటి సమస్య పట్టిపీడిస్తోందని, దూర ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి దప్పిక తీర్చుకోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వీధుల్లో చాలా చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో చీకటి పడితే ఇల్లు దాటి బయటకు వెళ్లేందుకు భయపడుతున్నామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో, ఎక్కడికక్కడ మురుగు నిలిచి, దోమల వ్యాప్తితో రోగాలు విజృంభిస్తున్నాయన్నారు. తమ సమస్యలపై అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతోనే నిరసనకు దిగాల్సివచ్చిందన్నారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో మరోసారి ఆందోళనకు దిగనున్నట్లు జనసేన పార్టీ నాయకుడు అప్పలరాజు హెచ్చరించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ కార్యదర్శికి అందించారు. నిరసనలో పరదేశి, సమ్మెంగ అప్పారావు, బొంది దుర్గారావు, సీహెచ్ ముత్యాలు, ఎస్.మహేష్, అమ్మోరయ్య, బొంది ముత్యాలు, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో అర్జీలకు సకాలంలో పరిష్కారం



ఎల్లుప్పిలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ తదితరులు

సబ్బవరం: రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని విచారించి, సకాలంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని బోదువలస, ఎల్లుప్పి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని, రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించుకోవాలన్నారు. ఎల్లుప్పిలో మొత్తం 1774.27 ఎకరాల భూమి ఉండగా, ఇందులో 699.65 ఎకరాలు ప్రభుత్వ భూమి, 1,074.62 ఎకరాల జిరాయితీ ఉందన్నారు. ఎల్లుప్పి సదస్సులో 4 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. బోదువలస గ్రామంలో మొత్తం 851.61 ఎకరాల భూమిలో 218.17 ఎకరాలు ప్రభుత్వ భూమి, 633.44 ఎకరాలు జిరాయితీ భూమి ఉందన్నారు. సదస్సుల్లో సర్పంచ్‌లు నేబర్తి శ్రీనివాసరావు, ఉగ్గిన గంగునాయుడు, ఎంపీటీసీ ఉగ్గిన రాము, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, రెవెన్యూ సిబ్బంది రాంబాబు, గోవిందరావు, కామరాజు, రవి, ఈశ్వరరావు, ఎల్.శ్యామ్ కుమార్, మౌనిషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతాజయంతి వేడుకలు







లక్ష్మీనరసింహనగర్‌లో గీతాయజ్ఞం

పూజలందుకున్న గోపీజనవల్లభస్వామి

సింహాచలం: నగరానికి చెందిన పతంజలి గీతా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో గీతాజయంతి వేడుకలు సింహగిరిపై బుధవారం ఘనంగా జరిగాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై నగరంలోని పలు పాఠశాలలకి చెందిన విద్యార్థులతో సామూహిక గీతాపారాయణం కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమాన్ని తిలకించారు. పతంజలి గీతా పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రతినిధి గీతా సత్యవతి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొని, విద్యార్థులకు ఆశీస్సులు అందించారు.

లక్ష్మీనరసింహనగర్‌లో..

98వ వార్డు పరిధి లక్ష్మీనరసింహనగర్ గోపీజనవల్లభస్వామి ఆలయంలో గీతాజయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి గోవు పాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గీతా యజ్ఞంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలను జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా గీతాపారాయణం చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ కూడలి నుంచి ఉడా కాలనీ వరకు రోడ్డు మరమ్మతుల నిమిత్తం జీవీఎంసీ రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఆయా పనులకు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు చేతుల మీదుగా బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విశేషంగా ఏకాదశి తిరువీధి



తిరువీధిలో స్వామివారి ఉత్సవమూర్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై మదనగోపాలస్వామికి బుధవారం తిరువీధి ఉత్సవం జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో అధిష్టింజేశారు. సింహగిరి మాడ వీధిలో తిరువీధిని ఘనంగా నిర్వహించారు.

విమానాశ్రయంలో ఆదర్శ్ విద్యార్థులు



విమానాశ్రయం వద్ద ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

పెందుర్తి: సహ పాఠ్య కార్యకలాపాల్లో భాగంగా స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నగరంలోని ఎయిర్‌పోర్టును బుధవారం సందర్శించారు. ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థ గురించి కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. విమానాల రాకపోకల సమయాలు, సాంకేతిక సాయం గురించి శాటిలైట్ మ్యాప్‌ల సాయంతో సిబ్బంది విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా తదితరులు పర్యవేక్షించారు.

విస్తం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఐదుగురి ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పెందుర్తి: మండలంలోని పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్(విస్తం) కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కలర్ మూన్ టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగాలకు కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివప్రసాద్, కంపెనీ హెచ్ఆర్ కుస్మిత, ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి.అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.